క్లుప్తంగా

రంజాన్ శుభాకాంక్షలు



దగ్గుబాడులో ముస్లిం సోదరులతో కలసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న యడం బాలాజీ

దగ్గుబాడు (కారంచేడు): ముస్లిం సోదరులు 40 రోజుల పవిత్ర ఉపవాసముల సందర్భంగా దగ్గుబాడులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అభ్యర్థి యడం బాలాజీ పాల్గొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం రాత్రి మండలంలోని దగ్గుబాడు గ్రామంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లిం సోదరులతో ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారితో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. రాష్ట్ర మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గద్దం మస్తాన్‌వలీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మార్టూరు మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలీ, సయ్యద్ అహ్మద్, ముల్లా నూర్ అహ్మద్, ఎంపీటీసీ సభ్యులు ముల్లా మౌలాలీ, షేక్ నాయబ్ రసూల్, గ్రామ సర్పంచ్ గేరా రవీంద్రనాథ్ ఠాగూర్, గేరా మాణిక్యరావు, గోపతోటి బాబూరావు, టి. వెంకటసుబ్బారావు, గేరా ఆశీర్వాదం, మత పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అద్దంకి రూరల్: ఈ నెల 14న జ్యోతరాము పూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా వారిజీవిత చరిత్రపై బుధవారం విద్యార్థులకు పూలే అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈనెల 14 వతేది బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలకు జడ్జీలుగా బండారు ఆనందరావు, అత్తూలూరి శంకరరావు, కొంగల శ్రీనివాసరవు వ్యహరించారు. పోటీ పరీక్షలకు ఇన్విజిలేటరల్‌గా దార్ల శ్రీనివాసరావు, వీరాంజనేయులు, పూర్ణచంద్రారవు, శ్రీకృష్ణ, అంకమ్మరావు వ్యవహరిచారు. మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నాలుగు గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



పోలీస్ కవాతులో పాల్గొన్న సీఐ కృష్ణయ్య



ఇంకొల్లులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, బీఎస్ఎఫ్ జవానులు



ఇంకొల్లు: వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు, జవానులు

అద్దంకి రూరల్: మండలంలోని పేరాయపాలెం, మోదేపల్లి, కోటికలపూడి, వేణుగోపాలపురం గ్రామాల్లో బుధవారం సీఐ పి. కృష్ణయ్య ఆధ్వర్యంలో కేంద్రబలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేదుకు అంతా సహకరించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రలోభాలకు లోనుకాంకుండా ఓటు హక్కులు వినియోగిచుకోవాలని సీఐ తెలిపారు.

ఇంకొల్లు (చినగంజాం): ఎన్నికల నేపథ్యంలో మండలంలోని దుద్దుకూరు, కొణికిలో పోలీసులు బుధవారం కవాతు నిర్వహించారు. ఇంకొల్లు ఎస్ఐ మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో పోలీసులు బీఎస్ఎఫ్ జవానులతో కలిసి కవాతు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గ్రామ ప్రజలు సహకరించాలని ఎస్ఐ కోరారు.

వైఎస్సార్ సీపీలో చేరిన నలభై కుటుంబాలు



కరణం వెంకటేష్‌కు మద్దతు తెలియజేస్తున్న మంకెనవారిపాలెం టీడీపీ నాయకులు, యువత

చీరాల టౌన్: అసెంబ్లీ ఎమ్మెల్యేగా కరణం వెంకటేష్ గెలుపు కోసం నిబద్ధతతో పనిచేస్తామని.. ఇకపై మీ వెంటే మా పయనమని వేటపాలెం మండలం మక్కెనవారిపాలెంకు చెందిన 40 టీడీపీ కుటుంబాలు కరణం వెంకటేష్‌కు హామీ ఇచ్చారు. మంగళవారం మక్కెనవారిపాలెంకు చెందిన టీడీపీ కుటుంబాలు అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి పార్టీ బలోపేతానికి, వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈసందర్భంగా అభ్యర్థి వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలో ఎంతో మంది బడుగు, బలహీనవర్గాల ప్రజలు లబ్ధి పొందారన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అందరి మన్నలను పొందారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిందన్నారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరువయ్యాయని మళ్లీ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందరికీ కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేష్, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌లకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలన్నారు. పార్టీలో చేరిన వారిలో చింతం రత్నం, గోపతోటి వినయ్, ఆసాది మస్తాన్ రెడ్డి, గాలి డేవిడ్, బాజిరెడ్డి, నాగూర్, అయ్యప్ప, పున్నయ్య, సతీష్, యస్వంత్, తదితరులున్నారు. అలానే దేవినూతల మాజీ సర్పంచ్ కాగిత సురేష్, నాయకలు తమ సంపూర్ణ మద్దతును ఎమ్మెల్యే బలరాం, అభ్యర్థి వెంకటేష్‌లకు హామీ ఇచ్చారు.

యాదవులంతా మా కుటుంబ సభ్యులే



కరణం వెంకటేష్‌ను సన్మానిస్తున్న యాదవులు

- వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్

చీరాల: యాదవులంతా తమ కుటుంబ సభ్యులుగానే భావిస్తామని.. తన తండ్రి ఎమ్మెల్యేగా, ఎంపీగా, ఎమ్మెల్సీ, రైతు సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవంతో సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామని వైఎస్సార్ సీపీ చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నారు. బుధవారం పేరాల్లోని గోలి సదాశివరావు కల్యాణ మండపంలో నియోజకవర్గ యాదవుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. కరణం వెంకటేష్ మాట్లాడుతూ యాదవుల అభివృద్ధికి తన తండ్రి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ప్రత్యేకంగా కృషి చేశారన్నారు. రైతులు, పశుపోషకులకు కావాల్సిన సహాయ సహకారాలను అందించామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, సీఎం వైఎస్ జగనన్న యాదవుల అభివృద్ధి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు వివిధ నామినేటెడ్ పోస్టులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ పదవులు కల్పించి యాదవులకు రాజకీయ ప్రాధాన్యత అందించారన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో యాదవులకు రెండు ఎమ్మెల్యే టికెట్లు, రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యే టికెట్లు అందించి రాజకీయంగా యాదవుల అభ్యున్నతికి జగనన్న ప్రత్యేకంగా కృషి చేశారన్నారు. ప్రతిపక్ష పార్టీలు యాదవులను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తే జగనన్న మాత్రం సముచిత స్థానం కల్పించారన్నారు. పలువురు యాదవ సంఘాల నాయకులు మాట్లాడుతు కరణం వెంకటేష్ కుటుంబానికి యాదవులు మద్దతు ప్రకటించడంతో పాటు విజయానికి కృషి చేస్తామన్నారు. అనంతరం వెంకటేష్‌ను యాదవుల సంప్రదాయాలతో సత్కరించారు. మాజీ ఎంపీ చిమటా సాంబు, ప్రకాశం జిల్లా ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కర్నేటి వెంకటప్రసాద్, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు కీర్తి వెంకటరావు, చుక్కా నాగలక్ష్మి, మించాల సాంబశివరావు, రైతు సంఘం నాయకుడు పులి వెంకటేశ్వర్లు, టి.లక్ష్మీప్రసాద్, బుర సాంబశివరావు, బోయిన రాఘవ, హచ్ రమేష్, రవి, అశోక్, అధికసంఖ్యలో యాదవ సంఘీయులు పాల్గొన్నారు.

పోల్ మేనేజ్‌మెంట్ పటిష్టంగా నిర్వహించండి



సెక్టోరియల్ అధికారులకు సూచనలందిస్తున్న ఆర్వో సూర్యనారాయణరెడ్డి

చీరాల టౌన్: ఎన్నికల పోలింగ్ రోజున జరిగే పోలింగ్ మేనేజ్‌మెంట్‌ను పటిష్టంగా నిర్వహించాలని ఆర్డీవో, చీరాల ఆర్వో జి.సూర్యనారాయణరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో పోల్‌మేనేజ్‌మెంట్, ఈవీఎంల వినియోగంపై ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా చీరాల ఆర్వో మాట్లాడుతూ మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో సెక్టోరియల్ అధికారుల బాధ్యత కీలకమైందని, సెక్టోరియల్ అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలో కేటాయించిన 22 మంది సెక్టోరియల్ అధికారులు చేయాల్సిన, అనుసరించాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు.

కొమ్మమూరు కాలువకు జలకళ

- తాగునీటి చెరువులను నింపుకోవాలి



కారంచేడు వద్ద తాగునీటి ప్రవాహంతో కళకళలాడుతున్న కొమ్మమూరు కాలువ

కారంచేడు: బాపట్ల జిల్లాలోని కారంచేడు, చీరాల, పర్చూరు, వేటపాలెం, చినగంజాం మండలాల్లోని గ్రామాల రైతులకు, ప్రజలకు తాగు, సాగునీటిని అందిస్తున్న కొమ్మమూరు కాలువ తాగునీటి విడదలతో కళకళలాడుతోంది. నీటిపారుదల శాఖ అధికారులు ముందుగా ప్రకటించిన విధంగా బుధవారం వేకువజాము నుంచే కృష్ణా కాలువకు తాగునీటిని విడుదల చేశారు. కేడబ్ల్యూడీ జేఈ అరుణ సాక్షితో మాట్లాడుతు ఎగువ నుంచి తాగునీటి అవసరాల నిమిత్తం 950 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని తెలిపారు. ఎంపీడీఓ బి. బాబూరావు, ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబులు మండలంలోని కుంకలమర్రు, కారంచేడు, స్వర్ణ, రంగప్పనాయుడువారిపాలెం గ్రామాల చెరువులకు పూర్తిగాను, ఆదిపూడి, తిమిడెదపాడు గ్రామాల చెరువులకు కొంతభాగం చెరువులను నింపుకోవడానికి అవసరమైన నీటిని పంపింగ్ చేసుకోవాలని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో తాగునీటి చెరువులకు అవసరమైన నీటిని త్వరగా పంపింగ్ చేసుకోవాలన్నారు. పై గ్రామాల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

గణపతిని ఆరాధిస్తే అన్నీ శుభాలే



అలంకరణలో వరసిద్ధి వినాయకుడు



వినాయక ప్రతిష్టా వేడుకల్లో హోమంలో పాల్గొన్న భక్తులు

బలికురవ: సకల దేవతలకు అధిపతి అయిన గణపతిని ఆరాధిస్తే అన్ని శుభాలేనని వేదపండితులు చింతలపాటి హరి సూర్య సుబ్రమణ్య సిద్ధాంతి అన్నారు. బల్లికురవలో ఫిబ్రవరి 28న వరసిద్ధి వినాయకస్వామి వాయు ప్రతిష్ట, శిఖర కలశ ప్రతిష్ట జరిగి 43 రోజులు పూర్తి అయిన సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. నవగ్రహ మండపారాధన హోమాలు, గణపతికి పంచామృతాలతో అభిషేకం ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేపట్టారు.

వృద్ధులను ఆదుకోవడం మానవతా ధర్మం

వేటపాలెం: అనాథ వృద్ధులను ఆదుకోవడం మానవతా ధర్మమని చీరాల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ నిషాద్ నాజ్ పేర్కొన్నారు. బుధవారం దేశాయిపేట పంచాయతీ నీలకంఠాపురలో గల అనాథ వృద్ధ శరణాలయంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించు కొని జడ్జి వృద్ధులకు బట్టలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వృద్ధాప్యంలో వృద్ధులను ఆదరించే వారు కరవవ్వడంతో వారికి అండగా ఉండేది ఇటువంటి ఆశ్రమాలే అన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ శాశ్వత కన్వీనర్ సత్రం మల్లేశ్వరరావు, అధ్యక్షుడు విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 18 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల్లో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 18 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు బుధవారం తెలిపారు. ఒయాసిస్ ఆటోమేషన్ టెక్నాలజీస్ బీటెక్, ఈసీ బ్రాంచిలకి చెందిన 2024 ఆఖరి సంవత్సరం చదువుతున్న 2023 లో పూర్తి చేసిన విద్యార్థులకు కళాశాల రిక్రూట్ మెంట్ ఫెసిలిటీలో క్యాంప్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు 70 మంది హాజరయినట్లు తెలి పారు. అందులో 30 మంది ఫైనల్ ఇంటర్వ్యూకు అర్హత సాధించగా 18 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. బీటెక్ విద్యార్థులు 15 మంది ఈఈఈ బ్రాంచి విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె. జగదీష్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.18వేలు వేతనం తోపాటు ఇతర అలవెన్సులను ఇస్తారని ప్రాంగణల ఎంపిక అధికారి ఎస్. పూర్ణచంద్రరావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అక్రిడిషన్స్ డైరెక్టర్ సి. సుబ్బారావు, వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.

150 మందికి దంత వైద్య పరీక్షలు

పర్చూరు (చినగంజాం): మండలంలోని అడుసుమల్లి గ్రామంలో బుధవారం సీబార్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో దంత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రజలకు దంత సంరక్షణ అవగాహన కోసం గుంటూరు తక్కెళ్ళపాడు సీబార్ పబ్లిక్ డెంట్ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ దేవకి, డాక్టర్ శ్రీలేఖ నిర్వహణలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ వర్చస్వి, అడుసుమల్లి ఎల్ఎస్‌సీఎస్ సొసైటీ, హెచ్‌పీ పెట్రోల్ బంక్ ప్రెసిడెంట్ నరిశెట్టి వెంకటరమణ, సీఈఓ దొప్పలపూడి రమాదేవి, దొప్పలపూడి శ్రీను, పెదనందిపాడుకు చెందిన వెల్లంకి బ్రదర్స్‌తో సంప్రదించి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో మొత్తం 150 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వారికి తగు సలహాలు ఇవ్వడంతో పాటు చికిత్స అందించి వారికి మెరుగైన వైద్యం కోసం సూచనలు ఇచ్చారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



నక్కలపాలెంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇంకొల్లు (చినగంజాం): ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ పోలింగ్ రోజున తప్పనిసరిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఇంకొల్లు తహసీల్దార్ కార్యాలయం ఆర్ఎస్ డీటీ విజయభాస్కర్ రెడ్డి అన్నారు. మండలంలోని నక్కలపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం రాబోయే సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని స్వీప్ కార్యక్రమానికి సంబంధించి క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ఏప్రిల్ 15 వరకు కొత్తగా ఓటు కోసం నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. వికలాంగులు, వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశామని, వారికి హోం ఓటు సౌకర్యం కూడా కల్పించనున్నట్లు ఆయన తెలియజేశారు. వీఆర్వో శ్రీలత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



బూదవాడలో రాజీనామా పత్రాలను అధికారులకు అందిస్తున్న వలంటీర్లు




కేశవరప్పాడులో అందిస్తున్న వలంటీర్లు

జె.పంగులూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. ఈ మేరకు పీఆర్ఏఈ రామ్‌కుమార్‌కు రాజీనామా పత్రాలు అందించారు. బూదవాడ గ్రామం నుంచి 13 మంది వలంటీర్లు, బైటమంజులూరు గ్రామం నుంచి 6 గురు వలంటీర్లు రాజీనామా చేశారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాతనే మేము వలంటీర్లు మా విధులు నిర్వర్తిమని తెలిపారు.

కేశవరప్పాడులో...

కేశవరప్పాడు (కారంచేడు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం, మళ్ళీ తమ నాయకుడు జగనన్నను సీఎంగా చూడాలనే ఆశతోనే మాకు అడ్డుగా ఉన్న వలంటీర్ల సేవలకు రాజీనామా చేస్తున్నామని కేశవరప్పాడు గ్రామానికి చెందిన ముగ్గురు వలంటీర్లు బుధవారం రాజీనామా పత్రాలను గ్రామ కార్యదర్శి జయప్రకాష్‌కు అందించారు. ఇంటింటికీ చేరాల్సిన అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఇప్పుడు మరలా పార్టీ గెలుపుకోసం పనిచేసేందుకు మా వ్యక్తిగత కారణాలతోనే ఈ రాజీనామాలు చేస్తున్నామని వలంటీర్లు చిరుమల త్రినాథ్, చిరుమల నరేంద్ర, చిరుమల హెబ్సీబాలు తెలిపారు.

సీఎం బస్ యాత్రకు తరలిన నేతలు



సీఎం బస్సు యాత్రలో పాల్గొన్న అద్దంకి వైఎస్సార్ సీపీ నేతలు

అద్దంకి రూరల్: నియోజకవర్గంలోని సంతమాగులూరు మండలంలో జరిగిన బస్సు యాత్రకు బుధవారం అద్దంకి నేతలు భారీగా తరలివెళ్లారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి మద్దతుగా అద్దంకి నుంచి తరలి వెళ్లారు. మండల, పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు కోట శ్రీనివాసకుమార్, కాకాని రాధాకృష్ణమూర్తి, కుందుర్తి రాఘవ రెడ్డి, కొప్పోలు హనుమంతరావు, మహిళా నాయకులు, కార్యకర్తలున్నారు.

మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు

అద్దంకి రూరల్: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా అక్రమ మద్యం విక్రయాలు, మద్యం నిల్వల గోడౌన్‌లను ప్రత్యేక నిఘా ఉంచి తగిన చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసులు అన్నారు. బుధవారం రాష్ట్ర స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ ఎం. రవిప్రకాష్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసులు అద్దంకి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో బుధవారం అద్దంకి అధికారుల తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ అనధికార మద్యం నిల్వలు, అమ్మకాలపై , పాత ముద్దాయిలను బైండ్ ఓవర్ చేయటం, వారిపై తగుచర్యలు తీసుకోవాలని అద్దంకి సబ్ ఇన్‌స్పెక్టర్ వి. సైమన్‌ను ఆదేశించారు. రాబోయే ఎన్నికల్లో మద్యం ప్రభావం చూపకుండా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీపుకోవాలన్నారు. విధులు సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ప్రభాకరావు, ఎస్సై సైమన్, సిబ్బంది పాల్గొన్నారు.

రెస్టారెంట్‌లో ఇరువర్గాల ఘర్షణ

మార్టూరు: రెస్టారెంట్‌లో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ విషయమై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పలువురుపై బుధవారం కేసు నమోదైంది. ఏఎస్ఐ మహబూబ్ బాషా వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ద్రోణాదుల గ్రామానికి చెందిన పాలెపు వెంకట్రావు అతడి కుమారుడు రామాంజనేయులు నాగండ్ల రోడ్డులో రెస్టారెంట్ నిర్వహిస్తున్నారు. కోలలపూడి ఎస్సీ కాలనీకి చెందిన సురభి షడ్రక్ అతని స్నేహితులతో కలిసి మంగళవారం రాత్రి భోజనం నిమిత్తం రెస్టారెంట్‌కు వచ్చారు. ఈక్రమంలో హోటల్ యాజమాన్యం, కస్టమర్ల మధ్య వాదన ప్రారంభమై పరస్పరం ఘర్షణకు దారి తీసింది. ఘర్షణలో హోటల్ యజమాని అతని కుమారుడు.. షడ్రక్‌తో పాటు అతని ఆరుగురు స్నేహితులపై దాడికి పాల్పడ్డారు. షడ్రక్ అతని స్నేహితులు సైతం హోటల్ యజమాని, సిబ్బందిపై ప్రతి దాడికి పాల్పడ్డారు. ఇరువర్గాల దాడిలో ఆరుగురు వ్యక్తులు గాయపడి చికిత్స నిమిత్తం మార్టూరు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి.. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

16న బల్లికురవ మండల సమావేశం

బల్లికురవ: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ హనుమా రెడ్డి బుధవారం తెలిపారు. ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, అధ్యక్షతన జరిగే సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.